ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని తన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు ఆయనను శుక్రవారం కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

అంగన్‌వాడీలో ప్రీ స్కూల్ సంసిద్ధత మేళా



జగద్గిరిగుట్ట: ప్రథమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజులరామారం సెక్టార్ శ్రీరాం నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రీ స్కూల్ సంసిద్ధత మేళా నిర్వహించారు. ఫౌండేషన్ కో ఆర్డినేటర్ తిమ్మప్ప, అంగన్‌వాడీ టీచర్ అనిత, సూపర్‌వైజర్ స్పందన మాట్లాడారు. మానసిక, శారీరక, సామాజిక, భాష, పూర్వ గణిత తదితర అంశాలపై అంగన్‌వాడీ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంపూర్ణ, మణికుమారి, వరలక్ష్మి, జ్యోతి, రజిత, సరళ, విజయ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయరూ!



జీడిమెట్ల: భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. సుభాష్‌నగర్‌లోని మార్కెట్ రోడ్డులో డ్రైనేజీ పైన ఉండే మూత 10 రోజుల క్రితం విరిగి లోపలికి కృంగిపోయింది. రోడ్డుపై వెళ్లేవారు ప్రమాదం బారిన పడకుండా స్థానికులు మ్యాన్‌హోల్‌లో కర్రను ఏర్పాటు చేశారు. మున్సిపల్ సిబ్బంది పట్టించుకుని మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

4,780 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు రైతుల నుంచి 4,780 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్‌లతో ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మంత్రులు మాట్లాడుతూ.. 2023 రబీ సీజన్‌లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. ఈ రబీ సీజన్‌లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు ముందెన్నడూ లేని విధంగా చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా నుంచి జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ, జిల్లా సివిల్ సప్లై జీఎం సుగుణబాయి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- సొసైటీల పేరుతో వసూళ్లు చేయొద్దు
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



సమస్యలు తెలుసుకుంటున్న కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల నుంచి సొసైటీ సభ్యులు డబ్బులు వసూలు చేయడం తగదని, ప్రభుత్వం అన్ని వసతులను ఉచితంగా సమకూర్చుతుందన్నారు. గృహ సముదాయంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నోటీసులతో ఆందోళన చెందవద్దని, సదరు నోటీసులకు రిప్లై లెటర్ రాసి సంబంధిత అధికారుల ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బహదూర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాదు యాదవ్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

లీకేజీతో తాగునీరు వృథా!



చింతల్: అసలే వేసవికాలం. తాగునీరు సరిపడా రాక జనం ఇబ్బందులు పడుతున్నారు. గుక్కెడు తాగునీటి కోసం అల్లాడుతుంటే జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా వందలాది కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన గోదావరి జలాలు రోడ్డుపై ఏరులై పారుతున్నాయి. మరమ్మతుల పేరుతో లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చిస్తున్నప్పటికీ లీకేజీలను మాత్రం ఇక్కడి అధికారులు అరికట్టలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. షాపూర్ నగర్ సబ్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నాయి. 300ఎంఎం పైపులైను వాల్వ్‌కు లీకేజీ ఏర్పడింది. మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులను చేపడతారో?, లేదో? వేచి చూడాల్సిందే.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.27 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 78 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వివేకానంద్ పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయ్ రామిరెడ్డి, రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, పోలే శ్రీకాంత్, నాయకులు కమలాకర్, ఇబ్రహీం ఖాన్, సిద్ధిరాములు, గుబ్బల లక్ష్మీనారాయణ, నరేందర్‌రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

నిజాంపేట్: రాజీవ్‌గాంధీ నగర్ కాలనీలో 15వ డివిజన్‌కు చెందిన బోరంచ ఆనందకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బీఆర్‌ఎస్ యువజన విభాగం ఎన్‌ఎంసీ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో చెన్నకేశవ్ తదితరులు పాల్గొన్నారు.

20న న్యూరో మెడికల్ క్యాంప్

నిజాంపేట్: గౌతమ్ న్యూరో కేర్, శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సరళాదేవి జ్ఞాపకార్థం సరళాదేవి ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 20వ తేదీన వాసవీ లే అవుట్ ప్రగతినగర్ జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌లో న్యూరో సర్జన్ కన్సల్టేషన్, ఈసీజీజీ, రక్తపరీక్షలు–సీబీపీ, ఆర్‌ఎఫ్‌టీ, ఎల్‌ఎఫ్‌టీ, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, న్యూరోపతి స్క్రీనింగ్, బాడి కంపోజిషన్ అనాలసిస్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

సఖీ కేంద్రానికి తరలింపు

జీడిమెట్ల: గుర్తు తెలియని మహిళ రోడ్డుపై తుచ్ఛాడుతుండగా జీడిమెట్ల పోలీసులు చేరదీసి సఖీ కేంద్రానికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ వివరాల ప్రకారం.. మాటలు, వినికిడి సరిగా లేని ఓ మహిళ(35) జీడిమెట్ల పీఎస్ పరిధిలో తిరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సదరు మహిళను చేరదీసి వివరాలు అడుగగా పొంతనలేని సమాధానాలు చెప్పంది. దీంతో పోలీసులు ఆమెను సంరక్షణ నిమిత్తం సఖీ కేంద్రానికి తరలించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాజులరామారం సర్కిల్‌లో అనేక అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేకుండా పరిమితికి మించి భవనాలను నిర్మిస్తున్నారని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్టలో రోడ్డు వెడల్పు అయినప్పటికీ రోడ్డును ఆక్రమిస్తూ భవనాలను నిర్మిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కు ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేస్తే అది అక్రమం కానప్పటికీ మున్సిపల్ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపే వారిపై చిల్లర మాటలు మానుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, నరసింహారెడ్డి, కోశాధికారి సదానంద్, శాఖ కార్యదర్శులు వెంకటేష్, సహదేవరెడ్డి, యాదగిరి, సాయిలు, యూసుఫ్, రాజు, శ్రీనివాస్ చారి, ఇమామ్, సామిల్, ప్రభాకర్, భీమేష్, సంతోష్, రాంరెడ్డి, కృష్ణ, కమలమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



గణేష్ నగర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఉప కమిషనర్ నర్సింహ



గాజులరామారం బాలయ్య బస్తీలో..

జగద్గిరిగుట్ట: జాతీయ డెంగీ నివారణ డే సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర్సింహ, ఎంటమాలజీ అధికారి ఉమారాణి, అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ సజావుగా కొనసాగేలా సహకరించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం కొంపల్లిలో ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబరు ప్లేట్లు లేని వాహనాలతో పాటు డ్రెస్ కోడ్ లేకుండా ఆటో నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి 100 మందికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలకు నాలుగు వైపులా నెంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. ఆటో ముందు ప్రయాణికులను కూర్చోబెట్టవద్దని సూచించారు.